## క్లుప్తంగా

### ఉద్యోగాలకు అదిత్య విద్యార్థుల ఎంపిక

టెక్కలి: ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ హ్యుందాయ్‌లో ఉద్యోగాలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఏడాదికి 5.5 లక్షల రూపాయల ప్యాకేజీతో కళాశాలకు చెందిన ఐదుగురు ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ సెల్ హెచ్‌వోడీ సంతోష్‌కుమార్ తదితరులు అభినందించారు.

### ఘనంగా షిర్డీసాయిబాబా పుణ్యదిన మహోత్సవం



అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

పలాస: పలాసలోని శివాజీనగర్‌లో షిర్డీ సాయిబాబా 107వ పుణ్యదిన మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. సాయిబాబా మందిరం ధర్మకర్త దువ్వాడ శ్రీధర్ బాబా ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేయగా.. వర్షంలో సైతం భక్తులు పెద్ద ఎత్తున స్వీకరించి సాయిబాబా ఆశీర్వాదం పొందారు. లోక కళ్యాణార్థం ఆలయ ప్రధాన పూజారి ధర్మపురి వాయినందన శర్మ వేద పండితులు మంత్రోచ్చారణాల నడుమ సాయినాథ మృత్యుంజయ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దువ్వాడ అన్నాజీరావు, ఆర్.శంకర్, ఆర్టీసీ శ్రీనివాస్, కృష్ణ, డాక్టర్ సుబ్బిరెడ్డి, సాయివర్ధన్, కొర్ల దుర్యోధన, మార్పు శ్యామ్, తిరునగరి శ్రీనివాస్, తారకేశ్వరరావు, ధర్మాపు గణపతి పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఉజ్జీవన సభలు



ప్రసంగిస్తున్న వైఎస్ విమలారెడ్డి

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో క్రైస్తవ స్త్రీల ఉజ్జీవన సభలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఆంధ్ర బాప్టిస్ట్ అధ్యక్షులు ప్రత్తి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ అంతర్జాతీయ సువార్తికులు వైఎస్ విమలారెడ్డి పాల్గొని మాట్లాడారు. స్త్రీల కోసం నిర్వహించే ఇటువంటి సమావేశాలు క్రైస్తవులలో ఆధ్యాత్మిక వృద్ధిని పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. బాప్టిస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్, పాస్టర్లు య.వి.ఎస్.జాన్సన్, బిషప్ అబ్రహం, ఏలియా, బిమ్మో, ప్రకాష్, సుందర్, క్రైస్తవ సంఘం పెద్దలు మేఘనాథం, డిల్లేష్, మల్లేష్, రవి పాల్గొన్నారు.

### ఆదర్శనీయులు మహాత్మాగాంధీ



పలాస: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి అప్పలరాజు తదితరులు



టెక్కలి: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పలాస: దేశ స్వాతంత్ర్యం కోసం అహింస మార్గం, సత్యాగ్రాహం ఆయుధంగా పోరాడిన జాతిపిత మహాత్మాగాంధీని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకో వాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గాంధీ జయంతి వేడకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కాశీబుగ్గలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీ పీ పలాస–కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిస్టు గోపి, నాయకులు సర్తు వెంకటరమణ, అంబటి ఆనందరావు, బోర బుజ్జి, గుజ్జు జోగారావు, పి.ప్రసాదరావు, పి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**గాంధీజీ అడుగు జాడల్లో నడవాలి**

టెక్కలి: ప్రతీ ఒక్కరూ గాంధీజీ అడుగు జాడల్లో నడవాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. కె.ప్రభాకర్రావు, కె.హరివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కంచమ్మతల్లి పాదుగలు ఆవిష్కరణ

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారు పాదుగలను కొందరు భక్తులు ఆర్థిక సాయంతో విజయదశమి సందర్భంగా గురువారం ఆవిష్కరించారు. వీటిని ఆలయ గర్భగుడి ప్రవేశం వద్ద ఏర్పాటు చేశారు.

### ముంచెత్తిన వాన..

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో పలు గ్రామాల్లో వరద నీరు ముంచెత్తింది. చెరువులు, గెడ్డలు పొంగి పొర్లుతూ వరద నీరంతా గ్రామాల్లోకి ప్రవేశించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో చెరువులుగా మారాయి. మరో వైపు ప్రధాన రహదారులపై ఉద్ధృతంగా వరద నీరు ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.



టెక్కలి: నరసింగపల్లిలోకి చేరిన వరద నీరు



టెక్కలి: రావివలస జంక్షన్ వద్ద ఎన్‌ఎం రోడ్డులో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

### కూలిపోయిన ఇల్లు

మందస: బహడపల్లి గ్రామంలో సార మిన్నారావు ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉన్నప్పటికీ అప్రమత్తంగా వ్యవహరించంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. ఇంట్లోని వస్తువులు తడిచిముద్దయ్యాయి. నిరుపేద మిన్నారావును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



మందస: భారీ వర్షాలకు కూలి సార మిన్నారావు ఇల్లు

# జలవిలయం..!

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం జలవిలయం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకూ కురిసిన అతిభారీ వర్షాలకు ఊళ్లకు ఊళ్లు నీట మునిగాయి. పంటపొలాలు జలమయమయ్యాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. జనజీవనం స్తంభించింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. చెట్లు విరిగిపడ్డాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలు తీవ్రనష్టాన్ని మిగిల్చాయి.

–సాక్షి నెట్‌వర్క్



వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బెండి గెడ్డ

### స్తంభించిన రాకపోకలు



సోంపేట: ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: మండలంలో కురిసిన భారీవర్షాలతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పలు గ్రామాల్లో చెట్లు నేలకు ఒరిగాయి. అధికారులు, స్థానికులు, పోలీసులు స్పందించి సోంపేట ప్రధాన రహదారితో పాటు ఇతర ప్రాంతాల్లో కూలిన చెట్లను తొలగించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని మహేంద్ర తనయ నది హైడిగాం ప్రాజెక్టు వద్ద ఉద్ధృతంగా ప్రవహించింది. బెంకిలి, పలాసపురం, లక్కవరం, బారువపేట, గొల్లగండి గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 500 ఎకరాల వరిపంట ముంపునకు గురయ్యింది. తహసీల్దార్ బి.అప్పలస్వామి , వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు.

### కవిటిలో 57.2 మిల్లీమీటర్ల వర్షం

కవిటి: వాయుగుండం ప్రభావంతో గురువారం కవిటి మండలంలో 57.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూశాఖ వర్గాలు ప్రకటించాయి. కపాసుకుద్ది, పుటియాదళ గ్రామాల్లో బీల పంటపొలాల్లో వరద నీరు నిలిచింది. కొబ్బరి రైతులకు ఈ వర్షం మేలు చేకూర్చింది.



కవిటి: కపాసుకుద్ధిబీలలో వరదనీటిలో వరిపొలాలు

### 1860 ఎకరాలు ముంపు

వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండలంలో కుండ పోత వర్షం కురిసింది. బెండి గెడ్డ ఉధృతికి నగరంపల్లి, గుళ్లలపాడు, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు బెండి, డోకులపాడు, వజ్రపుకొత్తూరు, బట్టుపాడు గ్రామాల్లో సుమారు 1860 ఎకరాల పొలాలు నీట మునిగాయి. తహసీల్దార్ సీతారామయ్య, ఏవో బి.ధనుంజయరావు శుక్రవారం పరిశీలించి అంచనాలు రూపొందిస్తున్నారు. 25 కొబ్బరి చెట్టు కూలిపోగా, 35 జీడి చెట్లు పూర్తిగా పాడైయ్యాయి. అంతర పంటలైన మునగ, అరటి, పనస, మామిడి తదితర పంటలకు తీవ్ర నష్టం జరిగింది. మెట్టూరు, అమలపాడు, నగరంపల్లితో పాటు అక్కుపల్లి, వజ్రపుకత్తూరు, పూండి 33/11 సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్నీ ఫీడర్లలో 17 విద్యుత్ స్తంభాలు నేల కూలిపోగా, ఏఈఈ జి.వి.రమణ ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. అలాగే పెద్దబడాం–అంతరకుడ్డ మధ్య సిమెంట్ కల్వర్టు కూలిపోయి బీటీ రహదారి కోతకు గురైంది. దీంతో నగరంపల్లి, బట్టుపాడు, చిన్నబడాం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పీఆర్ ఇంజినీర్ల బృందం పరిశీలించి పైపు కల్వర్టులు వేసి తాత్కాలికంగా రాకపోకలు జరిగేలా చేస్తున్నట్లు డీఈ జి.రవిబాబు తెలిపారు. 60–ఆర్ గూనాలపాడు, గుళ్లపాడు, దేశబట్టి, 5–ఎల్ తుంబవానిపేట, ఉండ్రాలగెడ్డ చెరువుతోపాటు పలాస మండలంలోని చోట వంశధార చానెల్‌కు గండ్లు పడ్డాయి. శివరాంపురం జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఓ వృద్ధులు వరదలో కొట్టుకుపోగా స్థానిక యువత అతనిని రక్షించింది. హుకుంపేటలో వరద నీరు నిలిచిపోయి ఇళ్లల్లోకి ప్రవేశించింది. ఉప తహసీల్దార్ మురళీక్రిష్ణ విపత్తు నిర్వహణ శాఖ అధికారులుతో వచ్చి నీటిని బయటకు తోడి ఇబ్బంది లేకుండా చేసారు. బెండి–వజ్రపుకొత్తూరు, బెండిగేటు–పూండి రహదారులపై చెట్లు నేలకొరిగిపోగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూండి, కవిటగ్రహారం రైల్వే అండర్ పాసేజ్‌లు వద్ద వరద నీరు నిలిచిపోవడంతో రాపోకలు స్తంభించాయి.



వజ్రపుకొత్తూరు: హుకుంపేటలో కొండ అప్పారావు ఇంటిలోకి చేరిన వరద



వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురం వద్ద రోడ్డుపై కూలిన చింత చెట్టు

### కొట్టుకుపోయిన రోడ్లు



నందిగాం:పెంటూరు–శివరాంపురం మార్గాన కోతకు గురి అయిన రహదారి



నందిగాం: పూర్తిగా నీట మునిగిన ఉయ్యాలపేట రహదారి

నందిగాం: భారీ వర్షానికి మండలంలోని పలు రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయి. నందిగాం మండలపరిధిలో 117.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా తొమ్మిది చోట్ల విద్యుత్ స్తంభాలు నెలకొరిగి సరఫరాకు అంతరాయం కలిగింది. ఉయ్యాలపేట గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకొని రహదారి మొత్తం నీటిమునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నందిగాం–పోలవరం రహదారిలో పోలవరం వద్ద, నందిగాం బెజ్జిపల్లి రహదారిలో బెజ్జిపల్లి గెడ్డ వద్ద, నౌగాం కల్లాడ రహదారిలో కల్లాడ సమీపంలో, కల్లాడ–దిమ్మడిజోల రహదారిలో దిమ్మడిజోల వద్ద నీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పెంటూరు శివరాంపురం రహదారిలో బడబంద జంక్షన్ వద్ద రోడ్డు కోతకు గురి కావడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా సాగుగున్నాయి. రోడ్లు వర్షం నీటితో నిండిపోవడంతో పోలవరం, ఉయ్యాలపేట పాఠశాలలకు మండల విద్యాశాఖాధికారి శుక్రవారం సెలవు ప్రకటించారు. పలు గ్రామాల్లో పంటపొలాల గుండా నీరు ప్రవహిస్తుండడంతో పంటలకు నష్టం జరిగే అవకాశం ఉంది.

**మునిగిన రోడ్డు.. మోసుకెళ్లిన యువకులు**

ఉయ్యాలపేటలో గురువారం పడిన భారీ వర్షానికి రోడ్డు జలదిగ్బంధంలో చిక్కుకొంది. ఇదే సమయంలో గ్రామానికి చెందిన బొచ్చ ధర్మారావుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో గ్రామానికి 108 వాహనం వచ్చే అవకాశం లేకపోవడంతో కొంతమంది యువకులు డోలీలో భారీగా ప్రవహిస్తున్న నీటిలోనే నౌపడ రోడ్‌కు చేర్చి అక్కడ నుంచి ఆస్పత్రికి తరలించారు. జలదిగ్బంధంలో చిక్కుకున్నా అధికారులు ఎవరూ రాలేదని సర్పంచ్ దీర్ఘాశి రమాదేవి, స్థానిక నాయకుడు క్రిష్టారావు ఆరోపించారు.

### 16.5 సెంటీమీటర్ల వర్షం పాతం నమోదు

పలాస: పలాస మండలంలో కురిసన భారీ వర్షాలకు వాగులు..వంకలు పొంగిపొర్లాయి. మొత్తం 16.5 సెంటీమీటర్ల వర్షం పాతం నమోదైందని డిప్యూటీ తహసీల్దార్ గిరి చెప్పారు. పలాస వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 407 హెక్టార్లలో వరిపంట నీట మునిగింది. నియోజకవర్గంలో 20 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపడడంతో పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. శుక్రవారం సాయంత్రానికి అన్ని గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించామని పలాస విద్యుత్ సబ్ డివిజనల్ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మంచినీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సెల్ టవర్లు పనిచేయకపోవడంతో సమాచార వ్యవస్థ దెబ్బతింది. కాశీబుగ్గ పెట్రోల్ బంకు నుంచి తాళభద్ర రైల్వే గేటు వరకు మోకాలు లోతు మించి రోడ్డుమీద నీరు ప్రవహించడంతో ఉద్దానం ప్రాంతాలైన పలాస, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి రావడానికి ఇబ్బంది కలిగింది. వాహనాలు నిలిచిపోయాయి. బ్రాహ్మణతర్లా వరహాల గెడ్డ పొంగి పొర్లి వెళ్లడంతో ఆ ప్రాంతంలో సుమారు పది గ్రామాలకు జనజీవనం స్తంభించింది. కంబిరిగాం వద్ద దేశబట్టి, వరహాల గెడ్డ పొంగి వంతెనపై నుంచి వెళ్లడంతో సుమారు పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అమలకుడియా, పూర్ణభద్ర గ్రామంలోకి నీరు చేరడంతో అక్కడ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రెవెన్యూ, వ్యవసాయ, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి పలాస మండలంలోని పలు గ్రామాల్లోని వరద ప్రాంతాల్లో పర్యటించారు.



పలాస–మొగిలిపాడు వద్ద పొలాలు మీదుగా పొంగిపొర్లుతున్న వరద



పలాస: ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బ్రాహ్మణతర్లా వరహాల గెడ్డ

### మూలపేట పోర్టు అర్‌అండ్‌ఆర్ కాలనీ జలమయం



సంతబొమ్మాళి: పోర్ట్ నిర్వాసితులకు నౌపడలో కేటాయించిన అర్అండర్ కాలనీలో చేరిన వరద

సంతబొమ్మాళి: భారీ వర్షాలతో పాటు వరద నీరు పోటెత్తడంతో వరి చేలు నీట మునిగాయి. నౌపడ, కొల్లిపాడు, హనుమంతునాయుడు పేట, వడ్డీతాండ్ర, దండుగోపాలపురం తదితర పంచాయతీల్లోని వరి చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షపు నీరు వెళ్లేదారుల్లో అడ్డగోలుగా రొయ్యిల చెరువుల నిర్మాణం చేయడంతో ముంపు ఇంకా తొలగిపోలేదు. రెయ్యిపేట సమీపంలో రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నౌపడ, జగన్నాధపురం, సెలకపేటలోని కొన్ని ఇళ్లలోకి వర్షం నీరు చొరబడింది. పోర్టు బాధిత మూలపేటలోని శివాలయం, రోడ్డు వర్షపు నీటి తో నిండి ఉన్నాయి. పోర్టు నిర్వాసితులకు కేటాయించిన అర్‌అండ్‌ఆర్ కాలనీ జలమయం కావడంతో చెరువును తలపిస్తున్నాయి. వర్షపు నీరు చేరడంతో నిర్వాసితులైన విష్ణుచక్రం గ్రామస్తులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నౌపడలోని ముంపు పొలాలను తహసీల్దార్ హేమసుందరరావు శుక్రవారం పరిశీలించారు.



సంతబొమ్మాళి: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ హేమసుందరరావు

### వర్షంతో జనం అవస్థలు



కంచిలి: బూరగాంలో వాటర్ ట్యాంక్ చుట్టూ నిలిచిన వర్షం నీరు

కంచిలి: మండలంలో కురిసిన భారీ వర్షానికి జనం అవస్థలు పడ్డారు. జనావాసాల్లోకి వర్షం, వరద నీరు చేరి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోవైపు పంట పొలాల్లో పెద్ద ఎత్తున వర్షం నీరు చేరింది. దీంతో రైతులు వాటిని బయటకు పంపేందుకు పరుగులెత్తారు. కంచిలి మెయిన్‌రోడ్డు, ఫ్లైఓవర్ పక్కన సర్వీసురోడ్డు మీదుగా పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. కార్లు, బైక్‌లు వంటి వాహనాల్లోకి రోడ్డు మీద నిలిచిన నీళ్లు చేరిపోవడంతో మొరాయించాయి. బూరగాంలో వాటర్ ట్యాంక్ పరిసరాలు జలమయమయ్యాయి. అంపురం ఎస్సీ కాలనీలో పలు ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. వర్షం గురువారం మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టడంతో నీళ్లు బయటకు పోయాయి.



మందస: వరద ముంపులో కిల్లోయి ఎంపీయూపీ పాఠశాల ఆవరణ



పలాస: కంబిరిగాం గెడ్డను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



కంచిలి: రైల్వేస్టేషన్ కూడలిలో మెయిన్‌రోడ్డులో నిలిచిన వర్షం నీరు



సంతబొమ్మాళి: నీట మునిగిన మూలపేట శివాలయం